ప్రజాశక్తి
ఆదివారం 25 జూన్ 2023 5
కర్నూలు





సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రామయ్య


# వాణిజ్యానికే భారం

- భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులు
- ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ రూపంలో బాదుడు

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

**ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా వాణిజ్య కనెక్షన్లకు కూడా విద్యుత్ బిల్ భారీగా పెరిగింది. ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ పేరుతో ప్రభుత్వం అదనపు బాదుడు వేయడమే అందుకు ప్రధాన కారణం. దీంతో దుకాణదారులపై తీవ్ర భారం పడింది...**

సామాన్యులతో పాటు దుకాణదారులు కూడా ఈ నెలలో విద్యుత్ బిల్లులు ముట్టుకోవాలంటేనే షాక్ కొడుతోంది. గత ఏడాది ఆగష్టు నుంచే తొలి విడత ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేస్తుండగా ఈ నెల నుంచి రెండో విడత ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేస్తుండటంతో సామాన్యులపై అదనపు భారం పడుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 1,25,378 వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు(ఎల్‌టి2) ఉన్నాయి. ఆ కనెక్షన్ల వినియోగదారులందరూ కలిసి మే నెలలో 1.95 లక్షల యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు వాడుకున్న విద్యుత్ వినియోగాన్ని 18 ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా తీసి ట్రూ అప్ చార్జీలు యూనిట్‌కు అప్పట్లో వినియోగించిన యూనిట్‌కు ఏడు పైసల చొప్పున వసూలు చేస్తున్నారని విద్యుత్ శాఖ చెబుతోంది. 2021-2022 సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్‌లో వాడుకున్న వినియోగానికి సంబంధించి అప్పట్లో వాడుకున్న వినియోగానికి యూనిట్‌కు 23 పైసలు చొప్పున ట్రూఅప్ భారం విధించారు. ఆ నెలకు సంబంధించిన విద్యుత్ బిల్లు జూన్ నెలలో వచ్చింది. అందులో సామాన్యులపై పెంపు భారం పడింది. ఇలా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న వాణిజ్య వినియోగదారులందరి మీద ఒక్క నెలలోనే రూ.45 లక్షల మేర ట్రూ అప్ భారం పడింది. మరో వైపు ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజి కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పిపిసిఎ) రూపంలోనూ రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులపై తీవ్ర భారం మోపింది. 2023 ఏప్రిల్‌లో వినియోగించుకున్న వినియోగానికి యూనిట్‌కు 40 పైసలు చొప్పునకింద అదనపు చార్జీలు జూన్‌లో వసూలు చేస్తున్నారు. ఇవి విద్యుత్ వినియోగదారుడికి అదనపు భారంగా మారింది. ఇలా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న వాణిజ్య వినియోగదారులపై ఎఫ్‌పిపిసిఎ రూపంలో ఈ ఒక్క నెలలోనే రూ.1.93 కోట్ల మేర భారం పడింది. వినియోగదారులపై ట్రూఅప్‌తో పాటు ఎఫ్‌పిపిసిఎ రూపాల్లో భారం వేయడంతో యూనిట్‌కు 63 పైసల చొప్పున భారం పడింది.





### ఎలా కట్టాలి?



నేను పంచర్ దుకాణం నిర్వహిస్తున్నాను. ప్రతి నెల రూ.600 వరకూ కరెంట్ బిల్ వస్తుంది. గత నెలలో వ్యాపారం సరిగా లేక దుకాణం తెరవలేదు. అయినా రూ.831 కరెంట్ బిల్ వచ్చింది. వ్యాపారమే సరిగ్గా లేకపోతే అంతంత కరెంట్ బిల్ వస్తే ఎలా కట్టాలి?

**- హర్షిత్, పంచర్ దుకాణం నిర్వాహకుడు, హోళగుంద**

# నగరాభివృద్ధికి కృషి

**- 26 తీర్మానాలకు స్థాయీ సంఘం ఆమోదం**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

నగరంలో నలుదిశలా అభివృద్ధి పనులు చేస్తున్నామని నగర మేయర్ బివై.రామయ్య పేర్కొన్నారు. శనివారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. కమిషనర్ ఎ.భార్గవ్ తేజ, సభ్యులు పల్లవి, సాన శ్రీనివాసులు, వైజ అరుణ, మల్లికాబేగం, రాజేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. మొత్తం 26 తీర్మానాలను ఆమోదించారు. రూ.8.30 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు కేటాయించారు. ఇందులో ప్రధానంగా నగరంలో ఉన్న 47 బస్ షెల్టర్లకు మరమ్మతులు, మాంసపు వ్యర్థాలను సేకరించేందుకు టెండర్ పిలుచుట, పలు వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు వంటివి ప్రధానంగా ఉన్నాయి. ఎంహెచ్‌ఒ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, డిసిపి మోహన్, ఎంఇలు శేషసాయి, షాకీర్, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, టిపిఆర్‌ఒ వెంకటలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఆమోదించిన తీర్మానాలు :** ఎపిఎస్‌ఆర్‌టిసి సూచించిన 47 బస్ షెల్టర్ల ఆధునీకరణకు టెండర్ పిలుచుట, చికెన్, మటన్, చేపల అంగళ్ళ నుంచి వచ్చే వ్యర్థాలను సేకరించుకు టెండర్ పిలువడం, 15 ఎంఎల్‌డి. వద్ద జనరేటర్ కొనుగోలుకు , రూమ్ నిర్మాణానికి రూ.62 లక్షలు కేటాయించాలని, అల్లూరి సీతారామరాజు నగర్‌లో కెసి కెనాల్ ఇరువైపులా పనులకు రూ.50 లక్షలు కేటాయించాలని, బుధవారపేటలో మెడికల్ కాలేజీ నుండి స్మశానం వరకు రూ.49.80 లక్షలతో 150 డబ్ల్యూ ఎల్ఇడి లైటింగ్ ఏర్పాటుకు ఆమోదించారు. కిడ్స్ వరల్డ్ కూడలిలో టవర్ క్లాక్ ఏర్పాటుకు రూ.50 లక్షలు, వార్డుల్లో అభివద్ధి పనులకు 17వ వార్డుకు రూ.35 లక్షలు, 19వ వార్డుకు రూ.75 లక్షలు, 20వ వార్డుకు రూ.30 లక్షలు, 21వ వార్డుకు రూ.50 లక్షలు, 31వ వార్డుకు రూ.35 లక్షలు, 35వ వార్డుకు రూ.49.50 లక్షలు, 8వ వార్డుకు రూ.20 లక్షలు, 22వ వార్డుకు రూ.30 లక్షలు, 24వ వార్డుకు రూ.40 లక్షలు, 23వ వార్డుకు రూ.30 లక్షలు, 45వ వార్డుకు రూ.49 లక్షలు, 46వ వార్డుకు రూ.40 లక్షలు, 48వ వార్డుకు రూ.48 లక్షలను వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తూ తీర్మానాలను ఆమోదం తెలిపారు.

# జెడి హామీతో ఆందోళన విరమణ

**- నేటి నుంచి తెచురుకోనున్న గిరిజన ఆశ్రమ పాఠశాల, హాస్టల్**
**- బోధనేతర సిబ్బందికి వేతనాలిస్తామని హామీ**
**- గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన జెడి**

**ప్రజాశక్తి-తుగ్గలి**

తుగ్గలి మండలం రాతన గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను రాష్ట్ర గురుకులం పాఠశాలల జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, డిప్యూటీ జాయింట్ సెక్రెటరీ రామ మోహన్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈనెల 12 నుంచి పాఠశాలలు తెరిచినప్పటికీ గిరిజన ఆశ్రమ పాఠశాలను తెరవకపోవడం, బోధనేతర సిబ్బందికి గత16 నెలలు నుంచి వేతనాలు అందకపోవడంతో ఆందోళనకు దిగారు. దీంతో పాఠశాల, వసతి గృహం మూతపడ్డాయి. విషయం తెలుసుకున్న గురుకులం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, డిప్యూటీ సెక్రెటరీ రామ్మోహన్ రెడ్డి బోధ నేతర సిబ్బందితో మాట్లాడి ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించుకున్నారు. శనివారం నుండి బోధనేతర సిబ్బంది యథావిధిగా విధులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా డిటిడబ్ల్యుఒ, గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాముడు, ప్రిన్సిపల్ రుద్రాల మునిశిలయ్య పాల్గొన్నారు.

**పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలి.సిపిఎం**

గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న బోదనేతర సిబ్బందికి పెండింగులో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేయాలని సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు అన్నారు. గత 16 నెలల నుండి సిబ్బందికి వేతనాలు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. సిబ్బందికి వేతనాలు ఇవ్వకుంటే ఆందోళన చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే వేతనాలను ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.



గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన జెడి

# జగనన్న భూహక్కు పత్రాల ఈ-కెవైసి తప్పనిసరి

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

జగనన్న భూహక్కు పత్రాల పంపిణీ సమయంలో ఈ-కెవైసి తప్పనిసరిగా చేసుకునేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి ఆదేశించారు. శనివారం విజయవాడ నుండి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జగనన్న భూహక్కు రీసర్వేలో భాగంగా ఫేజ్-2 గ్రామాలకు సంబంధించి డేటా ఎంట్రీ జులై 31 నాటికి పూర్తి చేయడంతో పాటు ఎంట్రీ పూర్తి అయిన వాటికి ఆగస్టు 31నాటికి ఫైనల్ ఆర్‌ఓఆర్ పూర్తి చేసి పబ్లికేషన్ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను సెప్టెంబర్ నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకుగాను సరైన ప్రణాళిక వేసుకొని త్వరితగతిన నిర్మించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చూడాలన్నారు. జగనన్నకు చెబుదాంకు సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 1902 ద్వారా 74,168 అర్జీలు వచ్చాయని వాటిలో 53,657 అర్జీలను (72 శాతం) సరైన సమయంలో బియాండ్ ఎస్‌ఎల్‌ఎకు వెళ్లకుండా పరిష్కరించామన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి

# విద్యారంగా అభివృద్ధికి చర్యలు

**- నగర మేయర్ బివై.రామయ్య**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగా అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నగరం మేయర్ బివై రామయ్య తెలిపారు. శనివారం నగరంలోని డాక్టర్ ఎపిజె.అబ్దుల్ కలాం ఎంఎంసిహెచ్ పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు పాఠశాల స్థాయి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ బివై. రామయ్య , మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, డిఇఒ రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులు కూడా శ్రద్ధతో చదివి అటు తల్లిదండ్రులకు ఇటు పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని వారు కోరారు. విద్యార్థులను , ఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాల స్థాయిలో మొదటి స్థానం పొందిన ఇ.సుశ్రితకు రూ.3,000, రెండవ స్థానం పొందిన ఎం.గౌతమ్ సాయికి, సుఫియన్‌కు రూ. 2,000 , మూడవ స్థానం పొందిన ముసాయిఫ్‌కు రూ. 1,000 ధృవీకరణ పత్రాలు ప్రదానం చేసారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రామయ్య

# పోరాట ఫలితం...

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

సిపిఎం నాయకుల పోరాటానికి ఫలితం దక్కింది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మెయింటెనెన్స్ చాలా అధ్వానంగా ఉన్నదని సిపిఎం గత రెండేళ్లుగా వివిధ రూపాలలో పోరాటం చేస్తూ వస్తోంది. ఈ పోరాటాల ఫలితమే నేడు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2.72 కోట్లు నిధులు ఎపిఎంఐడిసికి మంజూరు చేసింది. ఏడాదిన్నర క్రితం సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జిజిహెచ్‌లోని అన్ని వార్డులలో కలియ తిరుగుతూ వార్డుల్లోని సమస్యలను తెలుసుకుంటూ రోగులు వారి బంధువులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ఆసుపత్రి అధికారులకు, జిల్లా కలెక్టరుకు నివేదికలు అందజేశారు. ప్రధానంగా వార్డుల్లో పైకప్పుల పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. రోగులు వారి బంధువులు అక్కడ సేవలందించే వైద్య సిబ్బంది గాయాల పాలవుతున్నారు. ఫ్లోరింగ్ అంతా పగిలిపోయి ఎగుడు దిగుడుగా ఉంటూ స్ట్రెక్చర్లపై రోగులను తోసుకు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. వార్డుల్లో విద్యుత్ దీపాలు లేక చీకట్లోనే వైద్య సిబ్బంది రోగులు రాకపోకలు సాగిస్తున్నారు. ఫ్యాన్లు కూడా పనిచేయకపోవడంతో ఉక్క పోతకు రోగులు అల్లాడుతున్నారు. టాయిలెట్స్‌లో నీటి సౌకర్యం లేక కంపు కొడుతున్నాయి. ఇలాంటి సమస్యలపై సిపిఎం చేసిన పోరాటానికి ఫలితం దక్కింది.

**కొనసాగిన నిరసనల పర్వం..**

ఈ వారంలోనూ జిల్లా వ్యాప్తంగా నిరసనల పర్వం కొనసాగింది. కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించడంతోపాటు అన్ని రకాల మందులు ఉచితంగా ఇవ్వాలని, అన్ని రకాల రోగ పరీక్షలు ఆసుపత్రిలో చేయాలని ఇక్కడ జరుగుతున్న కమిషన్ల దందాను అరికట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో జిజిహెచ్ కాజువాలిటీ ముందు ధర్నా చేశారు. ఆసుపత్రి సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి ధర్నా వద్దకు వచ్చి ప్రజలతో మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి సిఎస్ ఆర్‌ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు వచ్చి సిపిఎం నాయకులతో మాట్లాడినా ఆందోళన విరమించలేదు. సూపరింటెండెంట్ వస్తేనే సమస్యలు పరిష్కారమవు తాయని నాయకులు భీష్మించడంతో కొంతసేపు ఉద్రిక్తత ఏర్పడింది. అనంతరం సిఎస్‌ఆర్‌ఎంఒకు వినతిపత్రం ఇచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజల నడ్డి విరుస్తూ వేస్తున్న విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను తక్షణమే రద్దు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ నెల 30న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కర్నూలు నగరంలోని జొహరాపురం సమీపంలోని బీడీ వర్కర్స్ కాలనీలో రోడ్లు, కాలువలు నిర్మించాలని ఆవాజ్ నాయకులు నగర పాలక సంస్థ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అక్రమంగా అధిక ఫీజులతో పుస్తకాలు అమ్ముతున్న శ్రీలక్ష్మిస్కూలు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నగర నాయకులు డిఇఒను కోరారు. నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని దేవనకొండలో సిపిఎం నాయకులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేనేత కార్మిక ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు చేనేత కార్మిక సంఘం నాయకులు ధర్నా చేపట్టారు.







ఎంపి డాక్టర్ సంజీవ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఇ.తాండ్రపాడు సర్పంచి బాలపీర

# గ్రామాభివృద్ధికి సహకరించండి

## ఎంపీకి సర్పంచి బాలపీర వనతి

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

ఈ-తాండ్రపాడు గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఆగ్రామ సర్పంచి బాలపీర కర్నూలు ఎంపీ సంజీవకుమార్‌ను కోరారు. శనివారం కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. బాలపీర మాట్లాడుతూ గ్రామ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో మురుగు కాలువలను నిర్మించాలన్నారు. వరదల కారణంగా టీజీవి నగర్‌లో దెబ్బతిన్న మురుగు కాలువలను పునర్నిర్మించాలన్నారు. సొంత స్థలాలు కలిగి ఉన్న వారికి పురాతన ఇల్లున్న వారికి వాటి స్థానంలో పిఎంఎవై పథకం ద్వారా రుణాలను ఇప్పించి గృహాలను నిర్మించాలన్నారు. ఇంద్రమ్మ కాలనీలో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్‌ను నిర్మించాలని, కాలనీలో ప్రమాదకరంగా ఉన్న 11కెవి కెవి విద్యుత్తు వైర్లను సరిచేయాలని కోరారు. మత్స్యకారుల స్మశాన వాటికకు వెళ్లేందుకు అనుకూలంగా సిసి రోడ్డును నిర్మించాలన్నారు. మైనార్టీలకు షాదిఖానాను నిర్మించాలని కోరారు. ముస్లిమ్స్ స్మశాన వాటికకు రక్షణగా ప్రహరీ గోడను నిర్మించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఎంపిలాడ్స్ నిధులను కేటాయించి గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్పంచి బాలపీర కోరారు.

# ట్రిపుల్ ఐటి డిఎం అభివృద్ధికి చర్యలు

**కేంద్ర మంత్రిదేవుసిన్హ్ జెసింగ్‌భాయ్ చౌహాన్**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ట్రిబుల్ ఐటి డిఎం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి దేవుసిన్హ్ జెసింగ్‌భాయ్ చౌహాన్ పేర్కొన్నారు. శనివారం కర్నూలు జగన్నాథ గట్టులో ఉన్న ట్రిపుల్ ఐటి డిఎం విద్యాసంస్థను కేంద్ర మంత్రి పరిశీలించారు. అనంతరం అక్కడే డైరెక్టర్ సోమయాజులతో కలిసి విద్యాసంస్థల అభివృద్ధి పనులపై సమీక్షించారు. ట్రిపుల్ ఐటిడిఎం కర్నూలులో 2015లో ప్రారంభించినప్పటి నుండి బోధన, పరిశోధన , అభివృద్ధి కార్యకలాపాలను సోమయాజులు కేంద్రమంత్రికి వివరించారు. రూ 90 కోట్ల విలువైన మానవరహిత విమాన వ్యవస్థలు , డ్రోన్‌లపై ఎలక్ట్రానిక్స్ , సమాచార మంత్రిత్వ శాఖ నుండి ప్రతిష్టాత్మకమైన మానవ వనరుల సామర్థ్యాన్ని పెంపొందించే ప్రాజెక్ట్‌ను సంస్థ రూపొందించిందన్నారు. ఇందులో 30 కేంద్రీయ సంస్థలు నెట్‌వర్క్‌గా పనిచేస్తుండగా ట్రిపుల్‌ఐటి డిఎం కర్నూలు ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అలాగే, ఇన్‌స్టిట్యూట్‌లో ప్రధానంగా శామ్‌సంగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్- బెంగళూరు నిధులు సమకూర్చిన శామ్‌సంగ్ ఇన్నోవేషన్ లాబొరేటరీ ఉందన్నారు. అధ్యాపకులు డిఎస్‌టి సెర్బ్, సిఎస్‌ఐఆర్, ఇస్రో, డిఆర్‌డిఒ నుండి సుమారు 5 కోట్ల పరిశోధన ప్రాజెక్టులను కూడా అందుకున్నారని ఆయన పేర్కొన్నారు. 2023 ఆగస్టు చివరి నాటికి మొదటి దశ నిర్మాణం , ఇతర మౌలిక సదుపాయాలు పూర్తి అవుతాయని ఈ సందర్భంగా మంత్రికి తెలియజేసారు. హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, ఇండోర్ స్టేడియం నిర్మించారని, రోడ్లు, నీటి లైన్లు, డ్రైనేజీ వ్యవస్థలు , ల్యాండ్‌స్కేపింగ్ వంటి ఇతర మౌలిక సదుపాయాలు పూర్తి కానున్నాయని కేంద్రమంత్రికి తెలిపారు. జాతీయ ప్రాముఖ్యత సంస్థ అయిన ఐఐఐటి డిఎం కర్నూలును భారతదేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థలలో ఒకటిగా తీసుకువస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.



మంత్రికి ట్రిపుల్ ఐటి డిఎం గురించి వివరిస్తున్న డైరెక్టర్

## సేపియంట్ సైనిక్ అకాడమీ విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ :** 2023-24 విద్యా సంవత్సరానికి జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో సేపియంట్ సైనిక్ అకాడమీకి చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ చాటారు. ఆవులు వాహిన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ , తెలంగాణా రెండు రాష్ట్రాలలో మొదటి ర్యాంక్‌ను సాధించారు. ఆల్ ఇండియా ర్యాంకింగ్స్‌లో 77వ స్థానంలో నిలిచారు. అకాడమీ డైరెక్టర్ వి.స్టీఫెన్ మాట్లాడుతూ విద్యారులు ఆశించిన ఫలితాలను సాధిస్తూ వారి కళలను, ఆశయాలను నెరవేర్చుకోవాలన్నారు. స్థాపించిన తొలిరెండేళ్లలోనే 14 మందికి పైగా ఆల్ ఇండియా సైనిక్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌లో మంచి ఫలితాలు సాధించారన్నారు. శనివారం ర్యాంకులు సాధించిన విద్యార్థులతో స్టీఫెన్ కర్నూలు కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కర్నూలు రేంజ్ డిఐజి సెంథిల్‌కుమార్‌ను కలిశారు. వారు సేపియంట్ అకాడమీ విద్యార్థులను, నిర్వహకులను అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, వి.స్టీఫెన్

## నూతన బైకును ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న వాసవి హోండా షోరూం వారి ఆహ్వానం మేరకు నూతన షైన్ 100 సిసి బైక్‌ను కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ. హాఫీజ్‌ఖాన్ ఆవిష్కరించారు. ఎమ్మెల్యేకు షోరూం ఎండి సోమిశెట్టి సురేష్ మర్యాదపూర్వకంగా శాలువా, బొకేలతో సత్కరించి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిర్వహించిన బైకు ట్రైల్ రన్ చూపరులను ఆకట్టుకుంది.



నూతన బైక్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్





ఎపి రైతు సంఘం పోస్టర్‌ను విడుదల చేస్తున్న జి.రామకృష్ణ, జి.ఆంజనేయులు

## 30న విజయవాడ మహాధర్నాకు తరలిరండి

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న విజయవాడలో జరుగు మహా ధర్నాకు భారీ సంఖ్యలో రైతులు తరలి రావాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ కోరారు. శనివారం కార్మిక కర్షక భవన్లో రైతు సంఘం ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జి.రామకృష్ణ మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న విజయవాడలో జరుగు మహాధర్నాకు జిల్లా వ్యాప్తంగా రైతులు తరలిరావాలన్నారు. రైతుల నుండి రకరకాల ప్రాజెక్టుల పేరుతో ఆరు లైన్ల , నాలుగు లైన్ల రోడ్డు భూములు తీసుకొని తక్కువ నష్టం పరిహారం ఇస్తున్నారని, న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని, గత సంవత్సరం జగన్ అన్న 2022లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని. బీమా పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పి ఇంతవరకు చెల్లించకపోవడం సోచ నీయమని చెప్పారు.రైతుల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా జరుగుతున్నదని, ధర్నా కార్యక్రమంలో రైతులందరూ పాల్గొని సమస్యలను ప్రభుత్వం తీసుకుపోయేందుకు జిల్లా రైతాంగం పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు జి. ఆంజనేయులు జిల్లా సహాయ కార్యదర్శి కోటకొండ, సూరి గిడ్డయ్య, ఓంకార్, కౌలుట్లయ్య, రాజు ,సోమేశ్, మద్దిలేటి, చంద్ర పాల్గొన్నారు.


# అర్హులందరికీ సంక్షేమ పథకాలు : కాటసాని



'గడపగడపకు మన ప్రభుత్వం 'లో ఎమ్మెల్యే కాటసాని

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 33 వ వార్డు 83 వ సచివాలయం కల్లూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీలోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో స్థానిక వార్డ్ కార్పొరేటర్ మైతాపు నరసింహులు, కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ మెంబర్ సాన శ్రీనివాసులు, కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంత రెడ్డి, సంగాల సుదర్శన్ రెడ్డి, కల్లూరు సింగిల్ విండో ప్రెసిడెంట్ శివ శంకర రెడ్డి, పెద్దపాడు మాజీ సర్పంచి శ్రీధర్ రెడ్డి, 33వ వార్డులోని వైసిపి నాయకులు రంగప్ప, జగదీష్, భాస్కర్, సుబ్బారెడ్డి, వీరేందర్, ఇస్మాయిల్, దేవాలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఇలియాస్, భద్రప్ప,కేశవరెడ్డి, వైసిపి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వైసిపి నాలుగేళ్ల పాలనలో పాణ్యం నియోజకవర్గం అభివృద్ధిపై ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ప్రజాశక్తి సిబ్బంది ఎం.రాజు, ఎల్లాగౌడ్, విలేకరులు సత్యనారాయణ, సోమశేఖర్ , నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

### ప్రజావ్యతిరేక విధానాలపై
## సమలశీల పోరాటాలు
**- సిపిఎం జిల్లా నాయకులు అంజిబాబు**

**ప్రజాశక్తి - ఆదోని**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను పోరాటాలకు సిద్ధం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు ఎమ్.డి.అంజిబాబు కోరారు. సిపిఎం సభ్యుల రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం సుందరయ్య భవన్‌లో రాజకీయ శిక్షణ తరగతులు పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్ అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ దారాదత్తం చేస్తోందన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాలు వేస్తోందన్నారు. దేశంలో మతోన్మాద శక్తులు లౌకిక విధానానికి భంగం కలిగేలా వ్యవహరిస్తున్నా అడ్డుకట్ట వేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సీనియర్ నాయకులు ఈరన్న, మహానంద రెడ్డి, తిప్పన్న, ముక్కన్న, నాగరాజు, వీరేష్, శ్రీనివాసులు, వెంకటేష్, మునెప్ప, అజీంఖాన్, రాజు, హనుమంతు, రాముడు, నాగేంద్ర, భరత్, ముత్తమ్మ, శంకరమ్మ, నర్సమ్మ పాల్గొన్నారు.

## ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పాలన
**- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

రాష్ట్రంలో ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పాలన కొనసాగుతోందని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 24వ వార్డు సచివాలయం పరిధిలో మూడో రోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, వాటి ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. వార్డు పరిధిలోని కొన్ని వీధుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, సిసి రోడ్లు, తదితర సౌకర్యాలు కల్పించాలని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల అభ్యున్నతి, వారి శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అన్ని వార్డుల్లోనూ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఒక ప్రణాళిక ప్రకారం సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను చేపడుతున్నామని తెలిపారు.


లబ్ధి పత్రాలను అందజేస్తున్న జగన్మోహన్ రెడ్డి

## కౌలురైతులకు గుర్తింపు కార్డులివ్వాలి
**- ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు**

**ప్రజాశక్తి - ఆస్పరి**

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు డిమాండ్ చేశారు. శనివారం రైతుసంఘం మండల కార్యదర్శి రంగస్వామి ఆధ్వర్యంలో సచివాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే నకిలీ పత్తి విత్తనాల వ్యాపారులు రైతులకు పత్తి విత్తనాలను అంటగడుతున్నారని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతేడాది మండలంలోని ఐనేకల్లు, యటకల్లు, నగరూరు తదితర గ్రామాల్లో నకిలీ పత్తి విత్తనాల వల్ల రైతులు నష్టపోయారని తెలిపారు. నష్టపోయిన రైతులకు పరిహారం, బీమా కూడా ఇవ్వలేదన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేసిన పంటలను జింకలు నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి జింకల బెడద నుంచి రైతులను ఆదుకోవాలని కోరారు. లేకపోతే రైతులతో కలిసి కార్యాలయాల ముందు దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ కుమార స్వామికి వినతిపత్రం అందించారు. రైతు సంఘం నాయకులు మాణిక్యప్ప, రామాంజినేయులు, వెంకట రాముడు, రైతులు రవి, వీరేష్, కాశన్న, ఆచారి, షేక్షావలీ, భీమన్న పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

### చచ్చిన పశువుల చర్మంతో వస్తువులు సృష్టించిన
# తొలితరం శాస్త్రవేత్తలు చర్మకారులు
**- చర్మకార వృత్తిదారుల సంఘం గౌరవాధ్యక్షులు ఆనంద్ బాబు**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

భారత సమాజంలో చచ్చిన పశువుల చర్మంతో వస్తువులు సృష్టించిన తొలితరం శాస్త్రవేత్తలు చర్మకారులని, అలాంటి చర్మకారుల బతుకుకు భరోసా కల్పించకపోతే ఎగిసే కెరటాల్లాగా ఉద్యమమై ఎగసి వస్తామని చర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎమ్.డి.ఆనంద్‌బాబు హెచ్చరించారు. శనివారం ఎమ్మిగనూరు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ చర్మకార వృత్తిదారుల సంఘం కర్నూలు జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. ముందుగా ఎస్సీ కాలనీ ఎమ్‌బి చర్చి దగ్గర నుంచి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం దాకా ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి తేరుబజార్ మీదుగా పద్మశాలి కల్యాణ మండపం వరకు ప్రదర్శన నిర్వహించారు. సంఘం జెండా ఆవిష్కరణ చేపట్టారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ చర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు హెచ్.జయరాజు అధ్యక్షతన జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం, ఆనంద్‌బాబు మాట్లాడారు. మానవ సమాజ అభివృద్ధి క్రమంలో కుండ, బట్ట లేని కాలంలోనే నీటిని నిల్వ చేసే తోలుతిత్తిని కుట్టి సమాజానికందించిన తొలితరం శాస్త్రవేత్త చర్మకారుడన్నారు. మెడగంటలు, వారలు, బెల్టులు, బ్యాగులు, నీటి బొక్కెన, అరిగోలు కింది పట్టా, కొలిమి గాలితిత్తి, చెప్పులు లాంటి ఎన్నో సమాజానికి అవసరమైన వస్తువులు సృష్టించారని తెలిపారు. కానీ సమాజం అధమ వృత్తి పేరుతో అంటగట్టబడిన ఈ వృత్తి కారణంగా బతుకు భద్రత లేక, నేటికీ చినిగిన గొడుగు, పాతబడిన బ్యానర్, చెట్టు, గోడ దాపులే వృత్తి కేంద్రాలుగా దుమ్ముకు, దూళికి అనారోగ్యాలకు గురవుతూ వృత్తిని కొనసాగిస్తున్నారని చెప్పారు. సంఘం పోరాట ఫలితంగా పింఛన్‌ను సాధించుకున్నామని, ఆ పింఛను రూ.5 వేలకు పెంచాలని కోరారు. పింఛనుతోపాటు సాధించుకున్న రూ.20 వేల విలువ చేసే పనిముట్లు నేటికీ ఇవ్వలేదన్నారు. వీటితో పాటు రెండెకరాల భూమి, ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని భవిష్యత్తులో నిర్వహించే పోరాటంలో భాగస్వామ్యం కావాలని కోరారు. చర్మకార వృత్తిదారుల సంఘం నాయకులు ఆంథోని, భాస్కర్, రాజు, కాలేబు, గుంటెప్ప, కెవిపిఎస్ జిల్లా నాయకులు విజయమ్మ, కరుణాకర్, కృష్ణ, తిక్కప్ప, గురుస్వామి, రమేష్, భాస్కర్, మారయ్య, మామిడికాయల రాజు, ఆనందరాజు, హనుమంతు, వెంకటేష్, చక్రపాణి తదితరులు పాల్గొని మాట్లాడారు. మరో 300 మంది చర్మకారులు మహాసభలో పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న నాయకులు


మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

## గిరిజన గురుకులంలో సమస్యలు పరిష్కరిస్తాం
**- రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ జెడి మల్లికార్జున రెడ్డి**

**ప్రజాశక్తి-ఆలూరు**

ఆలూరు నియోజకవర్గ కేంద్రంలో ఉన్న గిరిజన గురుకుల బాలికల, ఆశ్రమ బాలుర పాఠశాలల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లికార్జున రెడ్డి తెలిపారు. శనివారం గిరిజన గురుకుల పాఠశాలను పరిశీలించి ఉపాధ్యాయ, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 12 నుంచి బడులు తెరిచినప్పటికీ గిరిజన పాఠశాలలో వంట మనుషులు రాకపోవడంతో పాఠశాలకు విద్యార్థులు రావడం లేదని విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఈ విషయం మీడియాలో రావడంతో హుటాహుటిన జిల్లా, రాష్ట్ర అధికారులు జిల్లాలోని కర్నూలు, తుగ్గలి, ఆలూరులో ఉన్న గిరిజన పాఠశాలలను సందర్శించారు. ఏడాదికి పైగా వంట మనుషులకు, బోధనేతర సిబ్బందికి వేతనాలు ఇవ్వకపోవడంతో చాలీచాలని వేతనం, ఉద్యోగ భద్రత లేకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం జెడి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సిబ్బంది వేతనాలను ఇచ్చే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆందోళన విరమించి యథావిధిగా విధులను చేపట్టారు. అనంతరం గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు ముద్దనగేరి గ్రామంలో కేటాయించిన స్థలాన్ని పరిశీలించి, నూతన బిల్డింగ్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లా డిటిడబ్ల్యు ఇన్‌ఛార్జీ శ్రీనివాస్ కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ జమ్మన్న, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి మెంబర్ కృష్ణ నాయక్, సిఐటియు మండల కార్యదర్శి షాకీర్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, ఎస్ఎఫ్ఐ నాయకులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


సమస్యలు తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు నాయకులు

## ఆదోని ప్రగతికి బాటలు వేద్దాం

**ప్రజాశక్తి - ఆదోని**

క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా సమిష్టిగా కృషి చేసి ఆదోని ప్రగతికి బాటలు వేద్దామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని 9వ వార్డు మేతర్ మసీదు ప్రాంతంలో జరుగుతున్న 'జగనన్న సురక్ష' ఇంటింటి సర్వేను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అర్హులైన వారందరికీ అందేలా సహకరించాలని కోరారు. ఇంటింటి సర్వే చేసి సంక్షేమ పథకాలు పొందుతున్న, అందని వారి సమస్యలు తెలుసుకోవాలన్నారు. వాటిని పరిష్కారం చేసేలా తీసుకోవాల్సిన చర్యలపై వివరించాలన్నారు. వచ్చే నెల 1 నుంచి నెలరోజుల పాటు 'జగనన్న సురక్ష' మొదలవుతుందని తెలిపారు. జనన, మరణ, ఆస్తికి సంబంధించిన పన్ను చెల్లింపు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇతర మార్పు, చేర్పులు, ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా ఇవ్వనున్నారని చెప్పారు. పేదలు సద్వినియోగం చేసుకునేలా సచివాలయ, ఉద్యోగులు వాలంటీర్లు భాగస్వామ్యాలు కావాలన్నారు. మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ అస్లాం బాష, రామకృష్ణ ఉన్నారు.


సర్వేను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

## విఓఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలి
**- సంఘం జిల్లా అధ్యక్షులు బసవరాజు**

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

ఎపి వైకెపి విఓఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సంఘం జిల్లా అధ్యక్షులు సి.బసవరాజు కోరారు. శనివారం మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు దగ్గర ఎపి వైకెపి విఓఎల సమావేశం గోనెగండ్ల మండల గౌరవాధ్యక్షులు ప్రతాపరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విఓఎలు గ్రామీణ ప్రాంతంలో ఉన్న నిరుపేద మహిళలు ఆర్థిక, సామాజిక స్వావలంభన దిశగా, వారిని అభివృద్ధి పథంలో నడిపేందుకు, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను మహిళల గడప వద్దకు చేర్చడంలో కీలక పాత్ర వహిస్తున్నారని తెలిపారు. నిరంతరం మహిళలకు అందుబాటులో ఉండి సెర్ప్ నిర్వహించే ప్రతి పనిలో వారే కీలకమన్నారు. ఇన్ని చేస్తున్న విఓఎలకు ఉద్యోగ భద్రత లేదని తెలిపారు. ప్రభుత్వం వారిపై ఎలాంటి ఒత్తిడి లేకుండా చూడడంతో పాటు వారికి ఉద్యోగ భద్రత, బీమా కల్పించి ఇతర సౌకర్యాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, గౌరవాధ్యక్షులు మద్దిలేటి, సలహాదారులు రామలింగప్ప, సహాయ కార్యదర్శి భాస్కర్ నాయుడు, ఇతర మండల అధ్యక్షులు తిక్కన్న, ఈశ్వర్, బాలస్వామి, గోనెగండ్ల మండల అధ్యక్షులు లోకనాథ్ రెడ్డి, కార్యదర్శి మిన్నెల్లా, సోమన్న, మాదన్న, యంకన్న పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య రానివ్వం
**- చిప్పగిరి సర్పంచి గోవిందరాజులు**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

చిప్పగిరిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకునే బాధ్యత తనపై ఉందని సర్పంచి దాసరి గోవిందరాజులు తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిప్పగిరిలో రెండు, మూడు రోజుల్లోనే తాగునీటి కొరత లేకుండా అందిస్తున్న రెండు బోరు మోటార్లు కాలిపోయాయని తెలిపారు. వెంటనే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఆయన సలహా మేరకు మార్కెట్ యార్డు చైర్మన్ నారాయణ సహకారంతో వెంటనే బోరు మెకానిక్‌ను తీసుకొచ్చి కాలిపోయిన మోటార్ల స్థానంలో కొత్త ఎసి మోటార్లను వేయించి తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూసుకున్నామన్నారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా వెంటనే స్పందించి కొత్త బోరు మోటార్లను అమర్చి సమస్యను పరిష్కరించినందకు ప్రజలంతా సర్పంచి కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బాలన్న పాల్గొన్నారు.

### రూ.30 వేల విలువ చేసే
## కర్ణాటక మద్యం సీజ్

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్**

మండలంలోని మసీదుపురం గ్రామం సమీపంలో వాహనాల తనిఖీలో ఇద్దరు వ్యక్తుల నుంచి 480 (90 మిల్లీలీటర్లు) టెట్రా ప్యాకెట్లు రూ.30 వేల విలువ చేసే కర్ణాటక మద్యాన్ని సీజ్ చేసినట్లు సెబ్ సిఐ జయరాం నాయుడు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరు నుంచి బి.అగ్రహారం వెళ్లే దారిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కందనాతి, కడివెళ్ల గ్రామాలకు చెందిన ఎరుకల సుంకన్న, బోయ సమరసింహారెడ్డి దగ్గర నుంచి 5 బాక్సులు ఒరిజినల్ ఛాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని వారి మీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ సోమశేఖర రావు, హెడ్ కానిస్టేబుల్ గోపాల్, లింగ ప్రసాద్, రబ్బాని, చంద్రమౌళి, కానిస్టేబుల్ రామచంద్ర, నరసింహారెడ్డి, రాధమ్మ పాల్గొన్నారు.

# బీసీ హాస్టల్‌ను ఆలూరుకు మార్చండి...
**- మంత్రి గుమ్మనూరుకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ వినతి**

**ప్రజాశక్తి-ఆలూరు**

మూసివేయబోతున్న హాస్టల్‌ను ఆలూరు మండల కేంద్రానికి తరలించి విద్యార్థుల అభివృద్ధికి దోహదపడాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు కోరారు. శనివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మైనా మాట్లాడారు. హాలహర్వి మండలం కొక్కెరచెడు గ్రామంలో ఉన్న ఉన్నత పాఠశాల విద్యార్థులకు, పక్క గ్రామాల విద్యార్థుల కోసం బీసీ హాస్టల్ ఏర్పాటు చేశారని తెలిపారు. గత మూడేళ్ల నుంచి హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని చెప్పారు. ప్రస్తుతం హాస్టల్‌లో పదిమంది విద్యార్థులే ఉండడంతో అధికారులు హాస్టల్‌ను మూసివేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఉన్న హాస్టల్ మూసివేస్తే కొత్త హాస్టల్‌ను ఏర్పాటు చేసే పరిస్థితిలో ప్రభుత్వాలు లేనందున హాస్టల్‌ను మూసివేయకుండా ఆలూరు మండల కేంద్రానికి తరలించాలని కోరారు. ఆలూరులో ఎస్సీ సమీకృత హాస్టల్‌లో బీసీ విద్యార్థులకు తక్కువ సీట్లు కేటాయించడంతో విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశాలు ఎక్కువ ఉన్నాయన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి కొర్యుకరచేడు గ్రామంలో ఉన్న బీసీ హాస్టల్‌ను ఆలూరుకు మార్చాలని కోరారు. గర్ల్స్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లోనూ బీసీ సీట్లు పెంచాలని తెలిపారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, నాయకులు షాకీర్, డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు ధనంజయ్, నాయకులు పరమేష్, మల్లికార్జున, రంగస్వామి పాల్గొన్నారు.


మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## అక్రమంగా తరలిస్తున్న బియ్యం బస్తాలు స్వాధీనం

**ప్రజాశక్తి - మంత్రాలయం**

పేదలకు అందాల్సిన బియ్యం బస్తాలను అక్రమంగా తరలిస్తుండగా తనిఖీల్లో భాగంగా పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వేణుగోపాల్ రాజు తెలిపారు. శనివారం ఎమ్మిగనూరు రహదారిలో ఉన్న అయ్యప్ప స్వామి గుడి వద్ద ఎస్ఐ వేణు గోపాల్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. దేవనకొండ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన త్రినేత్ర, కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు చెందిన శివరాజ్, మంత్రాలయం మండలం చిలుకలడోన గ్రామానికి చెందిన ఎరుకల నాగరాజులు కెఎ 36 1001 నెంబర్ గల అశోక్ లేలాండ్ వాహనంలో 16 క్వింటాళ్ల (40 పిడిఎస్ బియ్యం బస్తాల)ను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. ఇన్‌ఛార్జీ ఆర్ఐ ఆనంద్, విఆర్ఒ భీమనగౌడు ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు.

## 'చట్టాలపై అవగాహన కల్పించండి'

**ప్రజాశక్తి - హొళగుంద**

సివిల్ రైట్స్ డే నిర్వహించి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య, ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రెసిడెంట్ సిహెచ్.నాగరాజు, దళిత సమాఖ్య మండల అధ్యక్షులు నల్ల మల్లేష్ కోరారు. శనివారం డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, తహశీల్దార్ హుస్సేన్ సాబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతినెలా చివరి రోజు పౌర హక్కుల దినోత్సవం జరుపుకోవడం, ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తే వారిని చైతన్య పరిచినట్లు అవుతుందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు చట్టాలపై పూర్తి అవగాహన లేకపోవడం వల్ల అక్కడక్కడ ఘర్షణలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్న, చిన్న విషయాలకు ఘర్షణలకు దిగకుండా ఉండాలంటే అంటరానితనం, అస్పృశ్యత, అత్యాచారాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మండల స్థాయి అధికారులపై ఉందన్నారు. ఇప్పటి నుంచి ప్రతి గ్రామంలోనూ నెల చివరి రోజు పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని కోరారు. రామాంజనేయులు, ముగ్గు గోవిందు పాల్గొన్నారు.

# వాడీవేడిగా సర్వసభ్య సమావేశం
**- విద్యుత్, వ్యవసాయం, హౌసింగ్ అధికారులపై మండిపడ్డ ప్రజాప్రతినిధులు**

**ప్రజాశక్తి - కౌతాళం**

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల అధ్యక్షులు అమ్రేష్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపిడిఒ సుబ్బరాజు వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లో సంక్షేమ పథకాలు అందని అర్హులకు 'జగనన్న సురక్ష' ద్వారా అందేలా కృషి చేయాలని తెలిపారు. వ్యవసాయ అధికారి శేషాద్రి మాట్లాడుతూ... రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. సులేకేరి రైతు భరోసా కేంద్రంలో అధికారి రైతుల నుంచి రూ.11 లక్షలు వసూలు చేసి ఉడాయించడంపై బంటకుంట సర్పంచి గోపాల్ రెడ్డి నిలదీశారు. ఎరువుల కోసం రైతులు ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లించాలని, ఆ అధికారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన వ్యవసాయ అధికారి ఆధారాలతో తమ వద్దకొస్తే న్యాయం జరిగేలా చూస్తామన్నారు. మండలంలో మూగ జీవాలు, మనుషుల ప్రాణాలు పోయినా విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదని కామవరం సర్పంచి వసంత్, బంటకుంట సర్పంచి గోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నా అధికారులు స్పందించడం లేదన్నారు. కామవరం చెరువు వద్ద విద్యుత్ తీగలు తగిలి ఒక వ్యక్తి మృతి చెందినా అక్కడ విద్యుత్ లైన్ మార్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యుత్ సమస్య వల్ల కౌతాళంలో తాగునీటి సమస్య ఏర్పడుతోందని సర్పంచి పాల్ దినకరన్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై ఎంపిడిఒ సుబ్బరాజు స్పందిస్తూ... విద్యుత్ శాఖ అధికారులు పనితీరు మార్చుకోవాలని, సమస్యలు పరిష్కరించడంలో దృష్టి సారించాలని ఆదేశించారు. జగనన్న గృహ నిర్మాణ పథకంలో అవినీతి రాజ్యమేలుతోందని ఎరిగేరి సర్పంచి గోవిందు సభ దృష్టికి తీసుకొచ్చారు. డబ్బులు ఇచ్చిన వ్యక్తులకు బిల్లులు మంజూరు చేస్తున్నారని, అర్హులకు కనీసం జియో ట్యాగింగ్ కూడా చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. 14 ఏళ్ల క్రితం నిర్మించిన గృహానికి హౌసింగ్ అధికారులు బిల్లులు మంజూరు చేసిన ఘనత ఉందన్నారు. ప్రజా ప్రతినిధులకు విలువ లేకుండా పోతుందని ఆగ్రహించారు. జగదీష్ మాట్లాడుతూ... పాడి రైతులు పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జుబేర్ మాట్లాడుతూ... హార్టికల్చర్ ద్వారా రైతులు ఆర్థిక అభివృద్ధి చెందాలని కోరారు. పిఆర్ ఎఇ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం మంజూరు చేసిన భవనాలు నిర్మించడానికి ముందుకు రావాలని కోరారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రమణ కాంత్ రెడ్డి, ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సుబ్బారెడ్డి మాట్లాడుతూ... మండల సర్వసభ్య సమావేశానికి ప్రతి శాఖ అధికారి తప్పకుండా హాజరుకావాలని, సమావేశానికి గైర్హాజరైన వారిపై శాఖ పరమైన చర్యలు తప్పన్నారు. తహశీల్దార్ రామేశ్వరరెడ్డి, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ మెంబర్ మాబు సాబ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అమ్రేష్

## ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి
**- బాధిత మహిళ**


**ప్రజాశక్తి - దేవనకొండ :** తమ పొలాన్ని ఆక్రమించాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ కోరారు. శనివారం ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ భూపాలుడుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెర్నేకల్ గ్రామానికి చెందిన ఉప్పర సరోజమ్మ మాట్లాడారు. మండలంలోని పొట్లపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 310/1ఎ, 310/2లో 6.64 ఎకరాల విస్తీర్ణంలో పొలం ఉందని తెలిపారు. గ్రామానికి చెందిన నూర్జహాన్ 3 ఎకరాల పొలాన్ని అక్రమంగా దున్నేశారని, అలాగే లక్ష్మి అనే మహిళకు చెందిన పొలాన్ని కౌలుదారుడు వన్నూరప్ప సాగు చేశారని చెప్పారు. అందులో సుమారు ఎకరా పొలాన్ని అక్రమంగా దున్ని పొలం హద్దుల కంచె స్తంభాలను చెరిపేశారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తహశీల్దార్ వెంకటేష్ నాయక్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్వేయర్ ద్వారా కొలిపించి పొలం హద్దులు చూపించామని, ఈ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని అన్నారని తెలిపారు. హద్దులు చెరిపి తమ పొలాన్ని ఆక్రమించే వారిపై రిపోర్టు రూపేణా పోలీసులకు నివేదించాలని కోరగా పొలం హద్దుల దగ్గర కాపలా ఉండాలని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు బాధితురాలు తెలిపారు. తమ పొలం ఆక్రమణకు గురి కాకుండా చట్టపరంగా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.


ఆక్రమణకు గురైన పొలాన్ని చూపిస్తున్న మహిళ

# సోదరభావంతో మెలగండి
**- డీఎస్పీ శ్రీనివాసరెడ్డి**

**ప్రజాశక్తి - హొళగుంద**

హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి కోరారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బక్రీద్ పండగ సందర్భంగా పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హొళగుంద కర్ణాటక సరిహద్దు మండలమని తెలిపారు. కర్ణాటక సంప్రదాయాలు ఎక్కువని, ఫ్యాక్షన్ అనే పదానికి దూరంగా ఉంటారని చెప్పారు. గతంలో హిందూ, ముస్లింల మధ్య ఒక చిన్న సంఘటన జరగడం వల్ల ఒక మచ్చ ఏర్పడిందన్నారు. ఈ మచ్చ తొలగిపోవాలంటే అందరూ సోదరభావంతో మెలగాలని కోరారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని, చట్టం పరిధిలో ఉన్నంత వరకు అందరికీ రక్షణ ఉంటుందని తెలిపారు. చట్టానికి వ్యతిరేకంగా ఎవరైతే నడుచుకుంటారో వారికి ఏ రక్షణా ఉండదని చెప్పారు. వాట్సప్ గ్రూపుల్లో మతపరమైన పోస్టులు ఏ ఒక్కరూ చేయకూడదన్నారు. ఇతరులను ఇబ్బంది పెట్టే అంశాలను వాట్సప్ గ్రూపులో పోస్టు చేస్తే గ్రూపు అడ్మిన్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని శాంతియుతంగా పండగలను జరుపుకోవాలని కోరారు. ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాసులు, తహశీల్దార్ హుస్సేన్ సాబ్ పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని పోలీసు స్టేషన్‌లో హిందూ, ముస్లిం, క్రైస్తవ మతపెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మిగనూరు రూరల్ సిఐ మోహన్ రెడ్డి మాట్లాడుతూ... ఎలాంటి సమస్యలున్నా వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. గోనెగండ్ల ఎస్ఐ తిమ్మారెడ్డి, ఎఎస్ఐ తిమ్మారెడ్డి, గ్రామ మత పెద్దలు ఖతీఫ్, అబ్దుల్ రెహమాన్, ఎస్‌బి.మన్సూర్ హుస్సేన్, పటేల్, రఫీక్, భాస్కర్ రెడ్డి, రంగముని, శివ రాముడు, మహేష్ పాల్గొన్నారు. **నందవరం** పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ పి.తిమ్మయ్య ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ కె.మోహన్ రెడ్డి మాట్లాడారు. బక్రీద్ పండగను ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని, అందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. హిందూ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ముగతి గ్రామానికి చెందిన గొల్ల రాముడు కుమారుడు గొల్ల పవన్ ఇంట్లో అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. బీరువాలోని రూ.60 వేల నగదు, 2 తులాల బంగారం, 80 తులాల వెండి అపహరణకు గురైనట్లు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.


హొళగుందలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

# 'జగనన్న సురక్ష' ద్వారా ప్రజలతో మమేకం కావాలి
**- మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజలతో మమేకం కావాలని మండల ప్రత్యేకాధికారి, సర్వశిక్ష అభియాన్ కె.వేణుగోపాల్, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ కొండయ్య తెలిపారు. శనివారం రామదుర్గం, నగరడోనా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సిసింద్రీ, నాగభూషణం ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' నిర్వహించారు. ప్రత్యేకాధికారి వేణుగోపాల్, మండల అధికారులంతా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలుంటే తెలపాలని కోరారు. గ్రామ వాలంటీర్లకు 'జగనన్న సురక్ష'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామానికీ తహశీల్దార్ ఒక బృందం, ఎంపిడిఒ ఒక బృందం ఏర్పడి 'జగనన్న సురక్ష'పై వెళ్తున్నారని తెలిపారు. విఆర్ఒలు మల్లికార్జున, కిష్టప్ప పాల్గొన్నారు.

**మంత్రాలయం :** మండలంలోని కలుదేవకుంట, చిలుకలడోన గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి నారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఎంపిడిఒ మణిమంజరి, తహశీల్దార్ చంద్రశేఖర్‌లు రెండు బృందాలుగా ఏర్పడి ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలకు అనర్హులుగా ఎందుకయ్యారు, దానికి కారణమేమిటి, సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఉంటే దానికి పరిష్కార మార్గాలు చూపి మంజూరు చేసి లబ్ధిదారులు లబ్ధి పొందేందుకు సూచనలు చేశారు. వగరూరు గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి 'జగనన్న సురక్ష' ద్వారా సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. మండల ప్రత్యేకాధికారి నారాయణ మూర్తి, గృహ నిర్మాణ శాఖ డిఇ లాలి కృష్ణయ్య మండలంలోని కాచాపురం గ్రామంలో జగనన్న కాలనీలో లే అవుట్‌ను పరిశీలించారు.


చిప్పగిరి: 'జగనన్న సురక్ష'లో పాల్గొన్న అధికారులు


మంత్రాలయంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు


ప్రజాశక్తి
ఆదివారం 25 జూన్ 2023
5
నంద్యాల





వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్

# వాణిజ్యానికీ భారం




**- భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులు - ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ రూపంలో బాదుడు**

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

**ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా వాణిజ్య కనెక్షన్లకు కూడా విద్యుత్ బిల్ భారీగా పెరిగింది. ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ పేరుతో ప్రభుత్వం అదనపు బాదుడు వేయడమే అందుకు ప్రధాన కారణం. దీంతో దుకాణదారులపై తీవ్ర భారం పడింది...**

సామాన్యులతో పాటు దుకాణదారులు కూడా ఈ నెలలో విద్యుత్ బిల్లులు ముట్టుకోవాలంటేనే షాక్ కొడుతోంది. గత ఏడాది ఆగష్టు నుంచే తొలి విడత ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేస్తుండగా ఈ నెల నుంచి రెండో విడత ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేస్తుండటంతో సామాన్యులపై అదనపు భారం పడుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 1,25,378 వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు(ఎల్‌టి2) ఉన్నాయి. ఆ కనెక్షన్ల వినియోగదారులందరూ కలిసి మే నెలలో 1.95 లక్షల యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు వాడుకున్న విద్యుత్ వినియోగాన్ని 18 ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా తీసి ట్రూ అప్ చార్జీలు యూనిట్‌కు అప్పట్లో వినియోగించిన యూనిట్‌కు ఏడు పైసల చొప్పున వసూలు చేస్తున్నారని విద్యుత్ శాఖ చెబుతోంది. 2021-2022 సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్‌లో వాడుకున్న వినియోగానికి సంబంధించి అప్పట్లో వాడుకున్న వినియోగానికి యూనిట్‌కు 23 పైసలు చొప్పున ట్రూఅప్ భారం విధించారు. ఆ నెలకు సంబంధించిన విద్యుత్ బిల్లు జూన్ నెలలో వచ్చింది. అందులో సామాన్యులపై పెంపు భారం పడింది. ఇలా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న వాణిజ్య వినియోగదారులందరి మీద ఒక్క నెలలోనే రూ.45 లక్షల మేర ట్రూ అప్ భారం పడింది. మరో వైపు ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజి కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పిపిసిఎ) రూపంలోనూ రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులపై తీవ్ర భారం మోపింది. 2023 ఏప్రిల్‌లో వినియోగించుకున్న వినియోగానికి యూనిట్‌కు 40 పైసలు చొప్పునకింద అదనపు చార్జీలు జూన్‌లో వసూలు చేస్తున్నారు. ఇవి విద్యుత్ వినియోగదారుడికి అదనపు భారంగా మారింది. ఇలా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న వాణిజ్య వినియోగదారులపై ఎఫ్‌పిపిసిఎ రూపంలో ఈ ఒక్క నెలలోనే రూ.1.93 కోట్ల మేర భారం పడింది. వినియోగదారులపై ట్రూఅప్‌తో పాటు ఎఫ్‌పిపిసిఎ రూపాల్లో భారం వేయడంతో యూనిట్‌కు 63 పైసల చొప్పున భారం పడింది.



**ఎలా కట్టాలి..?**

నేను పంచర్ దుకాణం నిర్వహిస్తున్నాను. ప్రతి నెల రూ.600 వరకూ కరెంట్ బిల్ వస్తుంది. గత నెలలో వ్యాపారం సరిగా లేక దుకాణం తెరవలేదు. అయినా రూ.831 కరెంట్ బిల్ వచ్చింది. వ్యాపారమే సరిగ్గా లేకపోతే అంతంత కరెంట్ బిల్ వస్తే ఎలా కట్టాలి?

**- హర్షిత్, పంచర్ దుకాణం నిర్వాహకుడు, హొళగుంద.**

# రీ సర్వేను పూర్తి చేయండి

**- ప్రాధాన్యత భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి**

**- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.ఎస్ జవహర్ రెడ్డి**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

రెండవ విడతలో చేపట్టిన రీ సర్వే పనులను పకడ్బందీగా త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.ఎస్ జవహర్ రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్లకు సూచించారు. శనివారం అమరావతిలోని సిఎస్ కార్యాలయం నుంచి స్పెషల్ సిఎస్, సిసిఎల్ఎ సాయి ప్రసాద్, వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి రెండవ దశ భూహక్కు, రీ సర్వే, ప్రాధాన్యత భవనాలు, జగనన్నకు చెబుదాం అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.ఎస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి ఆయా అంశాలలో ప్రగతి సాధనకు దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్, జెసి నిశాంతి.టి, డిఆర్ఒ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో రెండవ దశ రీ సర్వే పకడ్బందీగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం జారీ చేసిన దశల వారి ప్రక్రియలను ఆయా కాలపరిమితిలోపు తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్, వెక్టోరైజేషన్, విలేజ్ సెక్రటరీ, విఆర్ఒ, తాసిల్దారు, ఆర్డిఒ, జెసి లాగిన్‌లలో డేటా ఎంట్రీ పక్కాగా జరగాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్‌లో భాగంగా రెవిన్యూ రికార్డ్స్ మేరకు ప్రభుత్వ భూములను, ఎంజాయ్‌మెంట్ మేరకు పట్టా ల్యాండ్ భూములను పక్కగా రీ సర్వే చేయాలన్నారు. మొదటి దశ రీసర్వేలో గుర్తించిన లోపాలను సరిదిద్దుకొని రెండవ దశను పటిష్ఠంగా పూర్తి చేయాలన్నారు. ల్యాండ్ కన్వర్షన్, ఆధార్ సీడింగ్, ఫొటోలు మిస్‌మ్యాచ్ అంశాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాలలో హద్దురాళ్లు నాటే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ సచివాలయాలు, వైయస్సార్ హెల్త్ క్లినిక్స్, రైతు భరోసా కేంద్రాల భవనాల నిర్మాణ పనులు ఆగస్టులోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో నేటి నుండి ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమంలో వాలంటీర్లు ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, అర్హత ఉండి ఇంకా అందని ప్రభుత్వ పథకాల వివరాలు తెలుసుకొని సచివాలయం వద్ద సంబంధిత అంశంపై టోకెన్ వచ్చేలా ఏర్పాటు చేసి పథకాల లబ్ది అందేలా కృషి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ మనోహర్, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే ఎడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నిరసనల పర్వం

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

ఈ వారం రోజుల్లో నంద్యాల జిల్లా వ్యాప్తంగా నిరసనల పరంపర కొనసాగింది. పలు రంగాల్లో సమస్యలపై కార్మికులు, కర్షకులు, నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుండి పోరాట నిర్వహిస్తుందని, ఢిల్లీకి వినిపించేలా ఈ నెల 30న జరిగే ఛలో విజయ వాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. పలు ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారాన్ని మోపడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. విద్యుత్ ఛార్జీలు, భారాలపై ఈ నెల 30న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. పలు ప్రాంతాల్లో నాయకులు మహాధర్నా గోడపత్రికలను విడుదల చేశారు. జిల్లాలోని 29 మండలాలలోని గ్రామాలలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు దాదాపుగా పది నెలలు ఉన్నాయని వెంటనే చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. గాజులపల్లె గ్రామంలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో మహానంది తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

**ప్రబలిన అతిసార :** బనగానపల్లె మండలంలోని పలుకూరు గ్రామంలో ప్రజలు అతిసారా ప్రబలింది. గ్రామంలోని కొత్తపేట కాలనీలో 60 మంది వాంతులు, విరేచనాలతో మంచం పట్టారు. శుక్రవారం రాత్రి 16 మంది వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శనివారం ఉదయం నుంచి దాదాపు 44 మంది అనారోగ్యం బారిన పడ్డారు. వీరందరూ నంద్యాల, బనగానపల్లె, పలుకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలోని శుభ్రం చేయని వాటర్ ట్యాంకు నీళ్ల తాగి వాంతులు, విరేచనాలతో ప్రజల అవస్థలు పడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. వాటర్ ట్యాంకును సంవత్సరాలు గడుస్తున్నా శుభ్రపరచకుండా సరఫరా చేసిన నీటిని తాగడం వల్లే ప్రజలు అతిసార బారిన పడ్డారు. కాలనీలో తాగునీటి పైపులైన్లు మురికి కాలువల్లో వేయడం, పైపుల లీకేజీతో మురికి నీరు అందులోనికి వెళ్లడంతో కలుషితమయింది. ఆ నీరు తాగి వాంతులు, విరేచనాలతో గురైనట్లు కాలనీ ప్రజలు తెలిపారు.

**ఉద్రిక్తతల మధ్య ప్రజాభిప్రాయ సేకరణ :** అవుకు మండలం సుంకేసుల గ్రామంలో మైనింగ్ లీజుల ప్రజాభిప్రాయ సేకరణ ఉద్రిక్తతల మధ్య సాగింది. భారీ పోలీసు బందోబస్తుతో అధికారులు సమావేశాన్ని కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని సుంకేసుల గ్రామంలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ మైనింగ్ భూమి సర్వే నెంబర్ 333/3, 333/2లో సుమారు ఐదు ఎకరాలకు పైగా మైనింగ్ లీజు అనుమతులు పొందేందుకు గ్రామానికి చెందిన మాజీ సర్పంచి చిలకల నారాయణరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు.




# 30న మహాధర్నా

**- జయప్రదం చేయాలని గోడపత్రిక విడుదల**

**- ఎపి రైతు సంఘం**



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

రైతాంగ సమస్యలపై ఈనెల 30న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే రైతుల మహాధర్నా కార్యక్రమంలో నంద్యాల జిల్లాలోని రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా పోస్టర్‌ను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన గోరుకల్లు రిజర్వాయర్ నాణ్యత లోపం వల్ల కట్ట కుంగిపోయిందని, అలగనూరు ప్రాజెక్టు రైతులకు ఉపయోగం లేకుండా ఉందన్నారు. కొత్తపల్లె, పాములపాడు మండలాల్లో లిఫ్ట్ ఇరిగేషన్లు పని చేయడం లేదన్నారు. జిల్లాలో యుద్ధ ప్రాతిపదికన గోరుకల్లు, అలగనూరు రిజర్వాయర్ల మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న తెలుగు గంగ, ఎస్ఆర్బిసి పంట కాలువలను త్వరితగతిన పూర్తి చేసి ఆయకట్టు చివరి భూములకు కూడా సాగునీరు అందించాలని కోరారు. 2022 ఖరీఫ్, రబీ సీజన్లలో అధిక, అకాల వర్షాలు, నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన ప్రతి రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతాంగానికి అవసరమైన అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ప్రభుత్వమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు పెంచి ఇవ్వాలని కోరారు. సున్నా వడ్డీ, పావలా వడ్డీ ఉన్న పరిమితిని పెంచి బ్యాంకుల ద్వారా రైతులందరికీ రుణాలు ఇవ్వాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన పంట రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దళారీల దోపిడీ నుండి రైతాంగాన్ని రక్షించేందుకై ప్రభుత్వమే మద్దతు ధరలను అమలు చేసి అన్ని రకాల పంటలను కొనుగోలు చేయాలన్నారు. మండల కేంద్రాల్లో పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, జిల్లాలో అరటి రైతులను ఆదుకునేందుకు మహానంది ప్రాంతంలో అరటి కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. జాతీయ రహదారులు, సోలార్ ప్రాజెక్టులు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాట్ల వల్ల సాగు భూములు కోల్పోతున్న రైతులు, నిర్వాసితులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి రైతులను, నిరుద్యోగులను ఆదుకోవాలని తదితర సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్లేందుకై ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లాలోని రైతులందరూ వేలాదిగా తరలివచ్చి మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, నాయకులు బి.రామరాజు, జి.సుధాకర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న పట్టణ కార్యదర్శి శివ

## నిబంధనలు పాటించని ప్రైవేట్ హాస్టళ్లు

**- చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ**

**ప్రజాశక్తి - నంద్యాల**

నంద్యాలలో అనుమతి లేకుండా, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నడుపుతున్న ప్రైవేట్ హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులు, కోచింగ్ తీసుకుంటున్న యువతీ యువకులను ఆసరా చేసుకుని కొత్త కొత్త పేర్లతో రోజుకు ఒక్క హాస్టల్ పెడుతూ వేలకు వేలు ఫీజు తీసుకుంటూ నడుపుతున్నారని అన్నారు. ఒక రూమ్‌లో ఆరుగురిని పెడుతున్నారని, కనీసం రోజువారి మెనూ కార్డు కూడా ఏమాత్రం పెట్టకుండా నడుపుతున్నారని తెలిపారు. మరికొన్ని హాస్టల్లో సమయానికి భోజనం పెట్టడం లేదని, పెట్టినా భోజనం బాగోలేక విద్యార్థులు యువతీ యువకులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి నిబంధనలు పాటించకుండా నడుపుతున్న ప్రైవేట్ హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టణ నాయకులు వినీత్, సంజయ్, శ్రీను, ప్రవీణ్, గౌతమ్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

## యువకుడు ఆత్మహత్య



మృతి చెందిన వెంకట శ్రీను

**ప్రజాశక్తి - అవుకు :** మండలంలోని జూనుంతల గ్రామానికి చెందిన సిరోళ్ల వెంకటశ్రీను (25) ఉరి వేసుకుని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు వివరాల మేరకు.. సిరోళ్ల వెంకట శ్రీను అవుకు పట్టణంలోని స్టేట్ బ్యాంకుకు చెందిన సిఎస్‌పి సెంటర్లో ప్రైవేటు ఉద్యోగం చేసేవాడు. గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ వైద్యుల వద్ద చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో మనస్థాపం చెంది ఇంటిలో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. వెంటనే అతని తండ్రి గమనించి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## 1 నుండి ఇంటి వద్దకే అంగన్‌వాడీ సరుకులు

**- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మల**



**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ, బాలింతలకు అందించే బియ్యం, కందిపప్పు వంటి నిత్యావసర సరుకులు జులై 1 నుండి వైఎస్ఆర్ కిట్టు పేరుతో లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వనున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మల తెలిపారు. శనివారం ఆమెను కలిసిన ప్రజాశక్తితో మాట్లాడుతూ నిత్యావసర సరుకులు 3 కేజీలు బియ్యం, కేజీ కంది పప్పు, ఆయిల్ 500 ఎంఎల్, 2 కేజీలు రాగి పిండి, 1 కేజీ అటుకులు, పావు కేజీ బెల్లం, పావు కేజీ ఖర్జురాలు, పావు కేజీ చిక్కీలు ఫేస్ 1లో 13 ఎగ్స్, 2.5 లీటర్లు పాలు, రెండవ ఫేస్‌లో 12 ఎగ్స్, 2.5 లీటర్లు పాలు కిట్టు రూపంలో అందిచనున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు లబ్ధిదారులు అంగన్వాడీ కేంద్రాల్లోనే వచ్చి భోజనం చేసి వెళ్లాల్సి వచ్చేదని తెలిపారు. జులై 1 నుండి ఇంటి వద్దకే సరుకులు అందిస్తామన్నారు. గతంలో జొన్న పిండి కూడా ఇచ్చే వారమని, అయితే అందుకు బదులుగా కేజీ రాగి పిండితో పాటు అదనంగా మరో కేజీ రాగి పిండి ప్రభుత్వం నేరుగా ఇస్తుందన్నారు. ఈ ఏడాది వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్‌ను ఆత్మకూరు, శ్రీశైలం, కొత్తపల్లి మండలాల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. సంపూర్ణ పోషణ ద్వారా రక్త హీనత కలిగిన గర్భిణీ, బాలింతల్లో వాటిని నివారించడం, అలాగే పోషక విలువలు పెంపొందించనున్నట్లు చెప్పారు. మాతాశిశు మరణాల రేటును పూర్తిగా తగ్గించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుందన్నారు. జిల్లాలో 1,663 అంగన్వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం ద్వారా 6 సంవత్సరాలలోపు పిల్లలకు రోజుకు రూ.8, తక్కువ బరువు ఉన్న పిల్లలకు రూ.12, గర్భిణీలకు, బాలింతలకు రూ.9 ప్రభుత్వం ఖర్చు చేస్తుందని వెల్లడించారు.

## చదువుల బాధ్యత జగన్ మావయ్యదే : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి- నంద్యాల కలెక్టరేట్**

పేద విద్యార్థుల చదువు బాధ్యత అంతా జగన్ మావయ్య చూసుకుంటున్నారని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి రెడ్డి పేర్కొన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని కెఎన్ఎం మున్సిపల్ హైస్కూల్, ఉన్నత పాఠశాలలో ఆల్ మైనార్టీస్ ఎంప్లాయ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నంద్యాల డివిజన్ పరిధిలోని ఉర్దూ మీడియం పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ మాబన్నీసా చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, డిక్షనరీ అందజేసి ఘనంగా సన్మానించారు. అలాగే విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించిన ఉపాధ్యాయులకు, ప్రోత్సాహం అందించిన విద్యార్థుల తల్లిదండ్రులను అతిథులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పామ్ షావలి, కౌన్సిలర్ అబ్దుల్ మజీద్, కో ఆప్షన్ మెంబర్ సలాముల్లా, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సిద్ధం శివరాం, స్కూల్ హెచ్ఎం అసదుల్లా హుస్సేన్, ఆల్మేవా ప్రతినిధులు అబులైజ్, ఇమ్రాన్ పాష, మాలిక్ బేగ్, ముర్తుజ, అమీరుద్దీన్, షేక్ మహమ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తదితరులు

## రైతుల సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్**

రైతుల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో సంజామల మండలం అకుమళ్ల ప్రాజెక్ట్ కమలపురి వాటర్ షెడ్ పరిధిలోని అకుమళ్ల, బొందలదిన్నె, హెూత్రమాన్‌దిన్నె, కమలపురి, ముదిగేడు, నట్ల కొత్తూరు, వసంతపురం గ్రామాలకు చెందిన 328 మంది రైతులకు వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి రైతుల ప్రభుత్వమన్నారు. ఇన్ని విధాలా ఆదుకొంటున్న వైసిపి ప్రభుత్వం మేలు రైతులు మర్చిపోకూడదని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్ళీ సిఎంగా గెలిపించాలన్నారు. అప్పుడే పార్టీలకు, కులమతాలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ అడిషనల్ పిడి సలీం భాష, పిఓ విజేత, టివో బ్రహ్మానందరెడ్డి, జె.రమణ, వైసిపి నాయకులు గౌరీ గారి కిరణ్ కుమార్ రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.



వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

## నెల రోజుల్లోనే విద్యుత్ కనెక్షన్ : ఎఇ

**ప్రజాశక్తి - రుద్రవరం**

మండలంలో కొత్తగా బోర్లు వేయించుకున్న రైతులు విద్యుత్ కనెక్షన్‌కు అప్లికేషన్ పెట్టిన నెల రోజుల వ్యవధిలోనే మంజూరు చేస్తామని విద్యుత్ ఏఈ రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ఎల్లవత్తల సబ్ స్టేషన్‌లో రైతులతో సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పగటి పూట 9 గంటలు విద్యుత్ ఇవ్వాలని కోరారు. రైతులు తెలిపిన సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరగా పరిష్కరిస్తానని ఎఈ తెలిపారు. కార్యక్రమంలో కోటకొండ గ్రామ సర్పంచి దేగాని వెంకటేష్, ఎల్లావతుల సర్పంచి చంద్రమోహన్, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ ఏఈ రాఘవేంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఇఒ చంద్రశేఖర్ రెడ్డి

## ఆలయ ప్రతిష్టను కాపాడాలి : ఇఒ

**ప్రజాశక్తి - మహానంది**

సుదూర ప్రాంతాల నుండి మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులతో వ్యాపారస్తులు గౌరవ మర్యాదలతో మాట్లాడుతూ క్షేత్ర ప్రతిష్ట కాపాడాలని ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం మహానంది క్షేత్రంలో వ్యాపారస్తులతో ఆలయ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ శుక్రవారం కొన్ని దుకాణాలు తనిఖీ చేయగా నిషేధిత సిగరెట్స్, గుట్కా, పాన్ మసాలాలు దొరికాయన్నారు. క్షేత్రంలో నిషేధిత వస్తువులను విక్రయించరాదని, నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేసి జరిమానా విధిస్తామన్నారు. క్షేత్ర పరిధిలో తోపుడు బండిలో టీ అమ్మేవారు ఇకపై ప్లాస్టిక్ లేదా పేపర్ గ్లాసులను వాడకుండా తప్పనిసరిగా గాజు లేదా స్టీల్ గ్లాస్ మాత్రమే వాడాలన్నారు. మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ క్షేత్ర ప్రతిష్టను కాపాడే విధంగా ప్రతి ఒక్క వ్యాపారస్తుడు భక్తులతో మంచి ప్రవర్తనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పాలకమండలి సభ్యులు, మహానంది గ్రామ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## 27న చెస్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు

**ప్రజాశక్తి - నంద్యాల :** త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొనే నంద్యాల జిల్లా ఓపెన్, మహిళల జట్ల ఎంపిక పోటీలు నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27న రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రవికష్ణ రామసుబ్బారెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల ఓపెన్ కేటగిరి క్రీడాకారులు, మహిళా చెస్ క్రీడాకారులు పేర్లు ముందుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, వివరాలకు 9010451585 నెంబర్ సంప్రదించాలని కోరారు.

## ఇకెవైసి తప్పనిసరి : ఎఒ

**ప్రజాశక్తి - రుద్రవరం :** రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని కోటకొండ, ఎల్లవత్తుల గ్రామంలోని రైతుభరోసా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికి 1958 మంది రైతులు పీఎం కిసాన్‌కు సంబంధించి ఇకెవైసి చేయించుకోలేదని తెలిపారు. ప్రభుత్వం ఈ నెల చివరివరకు గడువు పొడిగించిందని, తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఏఇఒ రాజు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

## ఆర్‌డిఒ కార్యాలయంలో కదలని ఫైల్స్ : సిపిఎం

**ప్రజాశక్తి-డోన్**

డోన్ రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న రెవిన్యూ ఫైల్స్ కదలడం లేదని సిపిఎం మండల,పట్టణ కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్‌లు తెలిపారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ డోన్‌లో ఆర్‌డిఒ కార్యాలయం ఏర్పాటుతో రెవిన్యూ సమస్యలు తొందరగా పరిష్కారం అవుతాయనుకుంటే, అందుకు భిన్నంగా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఫైల్స్ కదలడం లేదని అన్నారు. అనేక మంది వృద్ధులు, రైతులు భూసమస్యల పరిష్కారం కోసం ఆర్‌డిఒ కార్యాలయం చుట్టూ తిరుగుతూ అలసిపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తున్నామని గొప్పలు చెబుతోందని కాని ఆచరణలో అధికారులు పనిచేయడం లేదన్నారు. ఆర్‌డిఒ తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిస్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో మండల కమిటీ సభ్యులు అబ్దుల్ రహిమాన్ పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

## 30న మహాధర్నా : ఎఐకెఎస్

**ప్రజాశక్తి - ఆత్మకూర్**

రైతాంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 30న విజయవాడలో జరుగు మహాధర్నాలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపి రైతు సంఘం మండల అధ్యక్షులు మా బాష, కార్యదర్శి వీరన్న, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్‌లు కోరారు. శనివారం పట్టణంలోని స్థానిక సుదర్శన వర్మ భవన్ నందు మహా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లో పంటలు వేసి నష్టపోయిన రైతులందరికీ ఇన్పుట్ సబ్సిడీ పంటల బీమా వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంగా కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసింహ నాయక్, పట్టణ పౌర సమాఖ్య నాయకులు ఏ సురేంద్ర, రైతు సంఘం నాయకులు ఏ కిరణ్, అంబయ్య,తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకులు

### ఆర్యవైశ్య యువజన సంఘం
## నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం

**ప్రజాశక్తి - ఆత్మకూర్**

ఆత్మకూరు పట్టణంలోని శనివారం స్థానిక వాసవి కళ్యాణ మండపంలో నూతన ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షులుగా పాలది గణేష్, వారి కార్యవర్గము ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆత్మకూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు పెద్ద శెట్టి అత్తలూరు రంగనాయకులు, జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు పువ్వాడి భాస్కర్, మండల ఆర్య సంఘం అధ్యక్షులు జక్కా మురళి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భీమిశెట్టి కృష్ణ, వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు నరహరి విజయలక్ష్మి, మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బివి నాగరాజు, గౌరవ అధ్యక్షులు మారం చంద్రశేఖర్, శిరిడి సాయి టెంపుల్ అధ్యక్షులు సూర్యనారాయణ, సుబ్బరామయ్య వాసవి సత్రం సముదాల కమిటీ మెంబర్, పూజల కమిటీ అధ్యక్షులు కట్ట నాగ సాయి బాబా, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి - చాగలమర్రి**

గ్రామాల్లో ఉపాధి పథకంలో రైతులకు 100శాతం సబ్సీడీతో ఇస్తున్న ఉద్యాన పంటలను సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డి తెలియజేశారు. శనివారం నాడు మండలంలోని చెంచుగూడెం గ్రామంలో చెంచు రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఉపాధి పథకంలో ఉద్యాన పంటలకు 100శాతం సబ్సీడీ ఇవ్వడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఏపీవో నిర్మల పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు పరిష్కరించాలి : రైతు సంఘం

**ప్రజాశక్తి - మిడుతూరు**

రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నాడు రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం మిడుతూరు మండల కమిటీ ఆధ్వర్యంలో తలముడిపి, జలకనూరు, చింతలపల్లి, దేవనూరు, మిడుతూరు మండల కేంద్రంలోని ఆర్బికె సచివాలయ అధికారులకు, తహసీల్దార్ కాశ్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత సంవత్సరం డిసెంబర్లో ఈ సంవత్సరం ఏప్రిల్, మే నెలలో వచ్చి అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విత్తనం నుండి పంట కొనుగోలు వరకు రైతు భరోసా కేంద్రాలు చూసుకుంటాయని చెప్పినప్పటికీ ఆచరణలో చర్యలు తీసుకోలేదన్నారు. పంటల బీమా, ఇన్సూరెన్స్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలన్నారు. ఇన్పుట్ సబ్సిడీ ఆహార



తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

పంటలకు ఎకరాకు రూ.10 వేలు, వాణిజ్య పంటలకు 25వేల రూపాయలకు పెంచాలని కోరారు. వడ్డీ రాయితీ గత సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్న జీరో వడ్డీ పథకం ద్వారా రైతుల అకౌంట్లో జమ చేసి లక్ష రూపాయల నుండి రెండు లక్షల రూపాయల వరకు జీరో వడ్డీ కింద రుణం ఇవ్వాలని, రెండు లక్షల నుండి రూ.5 లక్షల వరకు పావుల వడ్డీకి పెంచాలని రైతుల రుణమాఫీ రెండు లక్షల రూపాయలు చేయాలని అన్నారు. పంటలకు మద్దతు ధర కల్పించి, అన్ని ఆర్‌బికె సెంటర్లలో విత్తనాలు పూర్తి సబ్సిడీతో ఇవ్వాలన్నారు. ధాన్యాన్ని ఆర్బికే సెంటర్లో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మిడ్తూర్ మండలంలోని మెట్ట పొలాలకు హంద్రీనీవా ద్వారా సాగునీరు అందించాలన్నారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులిచ్చి రుణ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ గ్రామసభలు ఏర్పాటు చేసి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వి రామకృష్ణ, వి. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఓబులేసు, నాగరాజు, మద్దిలేటి, వి రమణ య్య, మిడుతూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం హరి నాయుడు, ఎం శేఖర్, స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

# 29న మల్లన్నకు సహస్ర ఘట్టాభిషేకం

**ప్రజాశక్తి - శ్రీశైలం**

శ్రీశైల క్షేత్రంలో మల్లికార్జున స్వామికి ఈనెల 29వ తేదీన సహస్ర గటాభిషేకం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఇఒ మాట్లాడుతూ 29న తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని చేస్తున్న పూజల్లో భాగంగా లోక కళ్యాణ అర్ధం సకాలంలో వర్షాలు కురవాలని పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ ఈనెల 27 నుండి మూడు రోజులపాటు జప పారాయణలు నిర్వహించి, 29న రుద్ర హెూమం నిర్వహించబడుతుం దన్నారు.

**ఆర్జిత సేవలు నిలుపుదల**

మల్లన్నకు సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తున్న సందర్భంగా 29వ తేదీన అన్ని ఆర్థిక సేవలో నిలుపుదల చేయబడుతున్నట్లు ఇఒ తెలిపారు. సహస్ర ఘటాభిషేకం సందర్భంగా 28వ తేదీన రాత్రి దర్శనాల ముగిసిన తర్వాత స్వామివారి గర్భాలయ ద్వారం వద్ద తాత్కాలిక గోడ నిర్మించబడుతుంది. 29న ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు సహస్ర ఘటాభిషేకం జరుగుతుంది. 29న ఉదయం 9 గంటల వరకు భక్తులకు దర్శనానికి అనుమతిని ఇవ్వడం జరుగుతుంది. సహస్ర గటాభిషేకం కారణంగా 29న రోజంతా స్వామివారు ఘటాభిషేకం జలంలోనే ఉంటారు. మరుసటి రోజు 30 తేదీన తెల్లవారుజామున మంగళ వాయిద్యాలకు ముందుగా గోడను తొలగించి ఘటాభిషేకం జలాన్ని తీసివేసి స్వామివారికి యధావిధిగా పూజలు నిర్వహించ బడతాయి. 29వ తేదీన స్వామివారికి అన్ని ఆర్జిత సేవలు నిలుపుదల చేయబడతాయని భక్తులు గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసు, పిఆర్ఓ శ్రీనివాసులు, శ్రీశైల ప్రభ సంపాదకులు డాక్టర్ సి.అనిల్‌కుమార్, దేవ స్థానం ఉద్యోగ సంఘం అధ్యక్షులు సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇఒ లవన్న

# సిఎం జగన్‌తోనే పేదలకు న్యాయం : ఎమ్మెల్యే



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - చాగలమర్రి**

సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే పేదల అభివృద్ధి సాధ్యమని ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. చాగలమర్రి పట్టణంలోని 2,3 సచివాలయాల పరిధిలో శనివారం నాడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఎమ్మెల్యే నాని కి గజమాలతో వైసీపీ రాష్ట మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బాబులాల్, ఎంపిపి వీరభద్రుడు,మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందజేసిన సం క్షేమ పథకాల ఫలాలను ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సోహెల్,వైస్ ఎంపీపీ రఫి, ఎంపీటీసీ సభ్యులు ఫయాజ్,లక్ష్మిరెడ్డి,మండల కోఆప్షన్ సభ్యుడు జిగ్గి గారి ఇబ్రహీం,ఆర్ఎస్ రమణ,మార్కెట్ యార్డు డైరెక్టర్ జాబీర్,సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి,జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి,వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

**సంజామల:** వైసిపి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని నొస్సం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నడు లేని విధంగా నొస్సం గ్రామాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఎన్నికల హామీలు 99 శాతం నెరవేర్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, నాయకులు శివరామిరెడ్డి, వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామిరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలికిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి

### రాష్ట్రంలో పక్షపాతం లేని పరిపాలన : ఎంపిపి

**బేతంచెర్ల:** రాష్ట్రంలో ఏ రాజకీయ పక్షపాతం లేకుండా సుభిక్ష పరిపాలన సీఎం జగన్మోహన్ రెడ్డి అందిస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. మండలంలోని ఎం పెండేకల్లు, రేపల్లి, వీరాయిపల్లి గ్రామాల్లో సర్పంచ్ రామక్క ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేసిన సీఎం జగన్మోహన్ రెడ్డి మాత్రమే అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల ఎంపీడీవో వెంగన్న, వైసిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి, ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు ఎస్ మూర్తి జావలి, తిరుమలేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎద్దులన్న గూని నాగరాజు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలి : సిఐ

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

పట్టణంలో రానున్న బక్రీద్ పండుగ, తొలి ఏకాదశి పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని టౌన్ సిఐ రమేష్ బాబు మతపెద్దలకు సూచించారు. శనివారం సాయంత్రం ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రానున్న పండుగలను పురస్కరించుకుని హిందూ,ముస్లిం మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, రెండు పండుగలు కలిసిరావడంతో ప్రజలందరు కులమత బేధాలు లేకుండా పండుగను ప్రశాంతంగా జరుపుకొని ప్రజలందరూ కూడా పోలీస్ శాఖకు సహకరించాలని సిఐ రమేష్ బాబు పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీ నాయకుడు అమీర్ బాష మాట్లాడుతూ ఆళ్లగడ్డలో మొదటి నుండి కూడా హిందూ ముస్లిం భాయ్ భాయ్‌గా ఎలాంటి తేడాలు లేకుండా కలసికట్టుగా ప్రతి పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని పేర్కొన్నారు. సమావేశంలో టౌన్ ఎస్ఐ వెంకటరెడ్డి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోమ్మంద్రు వినోద్ కుమార్, మసీదు పెద్దలు, పారిశ్రామికవేత్త టిఎంసి వేణుగోపాల్, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

# ఆలయాల అభివృద్ధికి కృషి : వైస్ చైర్మన్

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

దేవాలయాల అభివృద్ధికి జగనన్న ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ అన్నారు. పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలకు దూప, దీపాల కింద రూ. 5000 మంజూరు చేసిన వైసిపి ప్రభుత్వానికి విశ్వబ్రాహ్మణులు సిఎం జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలోని కాళికామాత ఆలయ ఆవరణంలో కమిటీ అధ్యక్షులు దురుగడ్డ రవీంద్ర చారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ కర్నూలు జిల్లా డైరెక్టర్ వరలక్ష్మిలు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2043 పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయాలకు దూప, దీప నైవేద్యం కింద నెలకు రూ. 5 వేలు సిఎం మంజూరు చేశారన్నారు. అనంతరం సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ ఆచారి, కౌన్సిలర్ రత్నాకర్, విశ్వ బ్రాహ్మణులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

## ఫ్యాప్టో కార్యాచరణను విజయవంతం చేయండి : ఎస్‌టియు

**ప్రజాశక్తి - చాగలమర్రి**

ఫ్యాప్టో కార్యచరణను విజయవంతం చేయాలని ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్లు శివశంకర్, ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి సుబ్బారావులు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద కార్యాచరణ కరపత్రాలను విడుదల చేసారు. అనంతరం విలేకరులతో వారు మాట్లాడుతూ 2019 ఎన్నిక లకు ముందు అధికారంలోకి వచ్చిన వారం రోజుల లోపు సిపిఎస్ రద్దు చేస్తామని,సకాలంలో డిఏలు,మెరుగైన పిఆర్‌సి ఇచ్చి కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని చెప్పి వైసీపీ అధికారంలోకి వచ్చి 4 సంవ త్సరాలైన ఉద్యోగులకు,ఉపాధ్యాయులకు ఇచ్చిన ఏ ఒక్క హామి నెరవేర్చలే దన్నారు. పాఠశాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న జిఓఎంఎస్ నెం 117 ను రద్దు చేయాలని,బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులను మినహా యించాలని,పిఆర్‌సి,ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. జూన్ 1 నుండి వివిధ స్థాయిలో కార్యాచరణ ద్వారా సెప్టెంబరు 1 వరకు వివిధ రకాల నిరసనలు తెలియజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎస్‌టియు సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, శేషాద్రి, నరసింహులు, రాజశేఖర్ రెడ్డి, సురేషప్ప, మహబూబ్ బాషా, వై శ్రీనివాసులు, మస్తాన్ భాష, సుజీవ్, నిరంజన్ మహబూబ్ హుసేన్, సుబ్బారెడ్డి, ఎన్ ప్రసాద్, గౌస్ అహమ్మద్, ఇబ్రహీం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైయినేజీలను పునరుద్ధరించాలి

**ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్**



డైనేజీ కాలువలు పునరుద్దించాలని, అన్ని కాలనీలలో కొత్త రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఐఎఫ్టియు కర్నూలు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు.వై ఆశీర్వాదం అన్నారు. శనివారం స్థానిక ఐఎఫ్టియు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో భారీగా వర్షాలు కోరవడం వల్ల కాలువలపై కొంతమంది కబ్జా చేసి వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేయడం వలన కాలవలన్నీ బుడిపోయాయన్నారు. మురికి నీరు చేరి పందులు సైరవీహారం చేస్తున్నాయని వాటి వల్ల విష జ్వరాలు వ్యాపించే అవకాశం ఉందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి డ్రైనేజ్ మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు మండల అధ్యక్షుడు వై శీను పి మల్లికార్జున, ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏ బెనహర్, ఎస్కే వలి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఆకస్మికంగా పురుగుల మందుల షాపును తనిఖీ చేసిన ఏడిఏ

## మొక్కజొన్న విత్తనాలు సీజ్

**ప్రజాశక్తి - పాములపాడు**

మండలంలోని బానకచర్ల వేంపెంట గ్రామాలలో ఏడిఏ ఆంజనేయ, మండల ఏవో పణీశ్వర్ రెడ్డి ఆకస్మికంగా పురుగుల మందుల షాపులను తనిఖీ చేసి అనుమతి లేని మొక్కజొన్న విత్తనాలను సీజ్ చేశారు. శనివారం బానకచర్ల గ్రామంలో పురుగుమందుల దుకాణంలో 1.4 క్వింటాళ్ల అనుమతి లేని మొక్కజొన్న విత్తనాలు సుమారుగా విత్తనాలను సీజ్ చేశారు. ఏడిఏ మాట్లాడుతూ గ్రామాల్లో నకిలీ విత్తనాలు అమ్మిన గ్రామస్థాయి కమిటీలు సభ్యులు తక్షణమే మండల కమిటీ దృష్టికి తేవాలన్నారు. గ్రామ స్థాయిలో కమిటీ ఉంటుందని ఈ కమిటీ మైనింగ్ అక్రమటి తరలింపు నకిలీ విత్తనాలు రేషన్ బియ్యం తరలింపు వంటి వాటిలో చురుకైన పాత్ర పోషించి పై అధికారులకు తెలియజేసినట్లయితే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

## చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపు : ఎంపిపి

**ప్రజాశక్తి - చాగలమర్రి**

చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపు తీసుకొస్తాయని ఎంపిపి రామిశెట్టి వీరభద్రుడు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో బదిలీ ఉద్యోగులకు సన్మాన సభ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్ళిన ఈఓఆర్‌డి నాగేం ద్రయ్య, ఏఓ చంద్రశేఖర్, టైపిస్టు సమతలను ఎంపిపి రామిశెట్టి వీరభద్రుడు, వైస్ ఎంపీపీ రఫిల ఆధ్వర్యంలో శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించి మెమెంటోలను అందజేసారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి బదిలీపై వచ్చిన ఎంపిడీఓ మహ బూబ్‌దౌలా, ఏఓ భరణి కుమారి, జూనియర్ అసిస్టెంట్ హరికిషన్ లను, ఈఓఆర్‌డిగా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు చేపట్టిన సుదర్శన్ రావులను శాలువలు,పూలమాలలతో సత్కరించా రు. బదిలీపై వెళ్ళిన వారి సేవలను పలువురు కొనియాడారు. ఏఈ కొండారెడ్డి, సర్పంచ్‌లు శివమ్మ, బాలీశ్వరరెడ్డి, బంగారు షరీఫ్, గోవిందయ్య, పంచాయతీ,సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్షతో అర్హులందరికీ పథకాలు

**ప్రజాశక్తి - బండి ఆత్మకూర్**

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి పేద లబ్ధిదారుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరిగిందని జెసిఎస్ మండల కార్యదర్శి ముడివేలు పుల్లారెడ్డి, ఎంఎల్ఓ పార్థసారధి తెలిపారు. శనివారం మండలంలోని ఏ కోడూరు, నారాయణ పురం, సింగవరం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర రెడ్డి, జెడ్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

పట్టణంలోని అనంత జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ అనంత రామసుబ్బారెడ్డి అధ్య క్షతన మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. సెబ్ ఇన్స్పెక్టర్ చంద్రమణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో యువత మాదక ద్రవ్యాలకు బానిస అవుతున్నారని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా వాటిని వినియోగిస్తున్నా, సరఫరా చేస్తున్న తమ దృష్టికి తీసుకొని వస్తే అరికడతామన్నారు. అనంతరం డిగ్రీ, ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షురాలు అనంత విజయలక్ష్మి, అధ్యాపకులు మాధవి, వెంకటేశ్వర్లు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను ప్రదానం చేస్తున్న సెబ్ ఇన్స్పెక్టర్ చంద్రమణి

# 'నీరు-పరిశుభ్రత'పై అవగాహన అవసరం

**డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్**

**ప్రజాశక్తి-డోన్**

ప్రజలకు , ప్రజాప్రతినిధులకు , అధికారులకు అందరికి నీరు-పరిశుభ్రత-పారిశుధ్యంపై అవగాహన కలిగి ఉండాలని డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ సూచించారు. శనివారం డోన్ మున్సిపాలిటీ కౌన్సిల్ భవనంలో 'నీరు-పారిశుధ్యం- పరిశుభ్రత" అంశాల గూర్చి ఎపిఎంఎఎస్ ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్స్‌కు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వాటర్ ఆర్గ్ ఎపి మాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సప్తశైల రాజేష్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నీరు-పారిశుధ్యం- పరిశుభ్రత అంశాలపై ప్రజల్లో అవగాహన త్వరితగతిన కలిగించాలన్నారు. ఈ సమయంలో కచ్చితంగా ఆరోగ్య అలవాట్లు పాటించాలన్నారు. సంఘ సమావేశాలలో వాష్ అలవాట్ల గూర్చి ఒక అజెండా పాయింట్ లాగా పెట్టుకొని సభ్యులను పాటించేలా ప్రోత్సహించాలని తెలిపారు. శుభ్రమైన నీరు, సక్రమమైన మరుగుదొడ్ల వాడకం , హ్యాండ్ వాష్ అలవాట్ల వల్ల అనారోగ్యాలు దరికి రావని ఈ విషయాల పట్ల సంఘాలలో అవగాహన కల్పించాలని తెలిపారు. మున్సిపాలిటీలో స్వచ్ఛ డోనుగా తీర్చిదిద్దే బాధ్యత మనందరి మీద ఉందని సూచించారు. వాష్ కోసం ఎవరైనా సభ్యులు అప్పు అడిగితే తప్పకుండా ఇవ్వాలని, అంతర్గత అప్పులు వాష్ అవసరం ఉన్న వారికి తప్పకుండా ఇవ్వాలని తెలిపారు. 'స్వచ భారత్ ద్వారా ప్రతి ఒక్క పట్టణంలో టాయిలెట్లను ఉపయోగించుకోవాలని, అందరు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, సిఇఒలు,ఆర్‌పిలు, టిఎల్ఎఫ్‌లు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

## బుగ్గనకు అండగా నిలుద్దాం : దినేష్‌గౌడ్

**ప్రజాశక్తి-డోన్**

డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి అండగా నిలుద్దాం డోన్ నియోజకవర్గ సోషల్‌మీడియా కోఆర్డినేటర్ దినేష్‌గౌడ్ అన్నారు. శనివారం 18 , 19వ వార్డు నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దినేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను అందరకు చేరువ చేసే విధంగా వైసిపి సోషల్ మీడియా వారియర్స్ భాగస్వామ్యమై నియోజకవర్గంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న అభ్యున్న తిని కొనియాడుతూ ప్రజలను చైతన్యవంత పరుస్తూ సోషల్ మీడియా వేదిక ద్వారా ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్‌ల , యూట్యూబ్ ద్వారా ప్రజలకు చేరువ చేయాలన్నారు. 18, 19 వార్డులలో కమిటీలను ఏర్పాటు చేసి వాళ్లకు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్ర మంలో స్థానిక కౌన్సిలర్ అశోక్, కాలేశా పెయిం టర్ వెంకటేష్, రైల్వే నాయుడు స్వామి, నరేష్ హమీద్, సోషల్ మీడియాకు కన్వీనర్ల అధ్యక్షతన ఆల ఈశ్వర్, విజయ్,కన్నా బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోషల్‌మీడియా కోఆర్డినేటర్ దినేష్‌గౌడ్

## 20 కుటుంబాలు టిడిపి నుండి వైసిపిలోకి..

**ప్రజాశక్తి - బనగానపల్లె**

సంజామల మండలం ఆకుమళ్ల గ్రామానికి చెందిన టిడిపికి చెందిన 20 కుటుంబాలు శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని నివాసంలో వైసిపిలో చేరాయి. బోయ కంబగిరి స్వామి, బోయ రామాంజనేయులు, బోయ రవీంద్ర, బోయ షెక్షావాలి, బోయ నూర్భా వలి, బోయ దోసకాయల సుబ్బయ్య, బోయ దోసకాయల నాగరాజు,బోయ రమేష్,షేక్ రఫీ,మద్రి పురుషోత్తం,బిరుసంటి ఓబులేసు, నూలి కొండయ్య, నూలీ టేకు అనందు, గోసుల ఓబులేసు, శ్రీరాముల నాగరాజు, శ్రీరాముల రవిలు టిడిపిని వీడి వైసిపిలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసి మళ్ళీ ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ మోహన్ రెడ్డిని చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఆకుమళ్ల ఎంపిటిసి గౌరుగారి కిరణ్ కుమార్ రెడ్డి, గౌరుగారి వెంకటేశ్వర రెడ్డి, సొసైటీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, శిలా రెడ్డి, రమణా రెడ్డి,మహేశ్వర రెడ్డి, కిరణ్, బత్తుల సుబ్బారెడ్డి, బోయ శ్రీనివాసులు, సుంకన్న, రాజన్న, కులాయప్ప తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీలో చేరుతున్న టిడిపి నాయకులు

## ఇంటర్ పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందించాలి

**- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ డిమాండ్**

**ప్రజాశక్తి - పాణ్యం**

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందించాలి అని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నాడు వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాప్,మధు కిరణ్,మహేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్య పుస్తకాలు కొనుక్కోవాలంటూ ఇంటర్ విద్యాశాఖ ఆదేశించడాని ఖండిస్తున్నాం అన్నారు. విద్యార్థులు ఫీజులు ద్వారా కట్టిన ఇంటర్ విద్యామండలి నిధులు మొత్తం నాడు-నేడు పథకానికి దారి మళ్లించడాని సిగ్గుచేటు అన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నేతలు